సాక్షి
ప్రకాశం
బుధవారం। 16। ఆగస్టు। 2023



కనిగిరిలో 18 వేల డబుల్ ఓట్లు

కనిగిరి నియోజకవర్గంలో 18 వేల డబుల్, దొంగ ఓట్లు ఉన్నాయని పరిశీలించి తొలగించాలని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. - 8లో..



కులాంతర వివాహం చేసుకున్నాడని దాడి

తన కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్నాడని ఆ యువకుడి తల్లి, అక్కపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికం. ఉక్కపోతగా ఉంటుంది.



జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్

మీ చిరునవ్వులే మా లక్ష్యం

- సరికొత్తగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం
- జిల్లా వ్యాప్తంగా 9,053 సమస్యలు
- జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఉచిత సేవలు
- జిల్లా సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు
- ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవం
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకావిష్కరణ
- పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి మేరుగు నాగార్జున



పరేడ్‌ను తిలకిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, ఎస్పీ మలికాగర్గ్





సీఎం చేతుల మీదుగా పోలీసు మెడల్ అందుకుంటున్న మార్కాపురం డీఎస్పీ వీర రాఘవరెడ్డి, ఒంగోలు దిశ డీఎస్పీ శ్రీనివాసరావు



వేడుకలను తిలకిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్



భరతమాత వేషధారణలో చిన్నారి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రజల ముఖాల్లో చిరునవ్వులు చిందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం 77వ సాంత్రంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. తొలుత ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడమే సీఎం వైఎస్ జగన్ ఆశయమన్నారు. ఈ ఏడాది మే నెల 9వ తేదీన ''జగనన్నకు చెబుదాం'' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 9,035 మంది నుంచి వినతులు వచ్చాయని, వాటిలో 79 శాతం పరిష్కరించామని చెప్పారు. మిగతావి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించేందుకు అవసరమైన 11 రకాల సేవలు ఉచితంగా ఇచ్చేందుకు జూలైలో ''జగనన్న సురక్ష'' కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థ, సచివాలయాల వ్యవస్థల ద్వారా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు, ఇతర సేవల కోసం 4,64,642 వినతులు స్వీకరించారన్నారు. వాటిలో 99.8 శాతం సేవలను పూర్తి చేసి ఉచితంగా సర్టిఫికెట్లు ఇచ్చామని గుర్తు చేశారు.

జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద 2019-20 నుంచి 2022-23 వరకు రూ.1421.77 కోట్లు రైతులకు అందించామన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే మొదటి విడతగా 2,84,113 మంది రైతులకు రూ.213.8 కోట్లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామని చెప్పారు. ఇక 2022లో పంటల బీమా కింద రూ.181.2 కోట్లు అందించామన్నారు. సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి మిషన్ పథకం కింద రూ.15.81 కోట్లతో రైతులకు సాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సాగునీటిని పొదుపుగా వినియోగించేందుకు, అధిక దిగుబడులను సాధించేందుకు 2023-24 సంవత్సరానికి రూ.116.8 కోట్లతో 10,300 హెక్టార్లను అభివృద్ధి చేయటానికి కూడా ప్రణాళికలు రూపొందించామన్నారు. పశు బీమా పథకం కింద 11686 గొర్రెలు, మేకలకు రూ.1.6 కోట్లు బీమా చేశారన్నారు. జిల్లాలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా 166 పాల కేంద్రాల నుంచి ప్రతి రోజు 14 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 1.16 కోట్ల లీటర్ల పాలు సేకరించి అందుకు గాను పాడి రైతులకు రూ.61.86 కోట్లు ఇచ్చామని తెలిపారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద 5760 మత్స్యకార కుటుంబాలకు రూ.5.26 కోట్లు అందించామన్నారు. ప్రజలకు నాణ్యమైన మత్స్య సంపదను అందించేందుకు ఫిష్ ఆంధ్రా షాపులను ఏర్పాటు చేశామన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 73993 గృహాలను రూ.1331.87 కోట్లు వెచ్చించి నిర్మించినట్లు వివరించారు. జిల్లాలో 619 వైఎస్సార్ జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి మెరకతోలడం, అంతర్గత రోడ్లు, అప్రోచ్ రోడ్లు, నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 453761 మంది మహిళలతో 45036 గ్రూపులు ఏర్పాటు చేయించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.192.6 కోట్లు డ్వాక్రా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు. 2023-24 సంవత్సరానికి గాను రూ.172 కోట్లు రుణాల రూపంలో ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా పథకాల ద్వారా కూడా ఆదుకుంటున్నామని వివరించారు. జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, జగనన్న చేదోడు, వైఎస్సార్ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల ద్వారా లబ్ధిదారులను ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో ప్రీ స్కూలు పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా బలవర్ధక పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తున్నామని, అందుకోసం స్కిల్ హబ్ సెంటర్లు నెలకొల్పామన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం, వైఎస్సార్ వాహన మిత్ర పథకాల ద్వారా కూడా లబ్ధిదారులకు చేయూతనిస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆసరా, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాల ద్వారా ఎంతో సేవ చేస్తున్నట్లు వివరించారు. విద్యా శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ప్రత్యేకంగా చేపట్టిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అన్న కార్యక్రమం విద్యార్థుల్లో మంచి అవగాహన పెంచిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, ఎస్పీ మలికా గర్గ్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం.ప్రసాద రెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జేసీ కె.శ్రీనివాస్, ట్రైనీ ఐఏఎస్ అధికారి మౌర్య పటేల్, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ తదితరులు పాల్గొన్నారు. ట్రైనీ ఐపీఎస్ అంకిత సురానా పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు.



పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

ఇద్దరు డీఎస్పీలకు పోలీస్ మెడల్స్

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో ఎలాంటి రిమార్కులు లేకుండా పనిచేయడమే కాకుండా శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల అణచివేతలో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులకు స్వాతంత్ర్య దిన వేడుకల్లో పోలీస్ మెడల్స్ అందజేశారు. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లాకు చెందిన మార్కాపురం డీఎస్పీ వీరరాఘవ రెడ్డి, ఒంగోలు దిశ డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావులకు మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మెడల్స్ అందజేశారు. మెడల్స్ అందుకున్న డీఎస్పీలకు ఎస్పీ మలికా గర్గ్ అభినందనలు తెలిపారు.

శాస్త్రీయ నృత్యం చేస్తున్న బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు



అలరించిన శకటాల ప్రదర్శన

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 77వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలు అలరించాయి. బేటి బచావో, బేటి పడావో, బాల్య వివాహాల రద్దు సందేశాలతో ఏర్పాటు చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ శకటానికి ప్రథమ ప్రథమ బహుమతి, వైఎస్సార్ జలకళ ప్రాధాన్యాన్ని వివరిస్తూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏర్పాటు చేసిన శకటానికి ద్వితీయ బహుమతి, చిరుధాన్యాలు, సిరి ధాన్యాలు నినాదంతో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన శకటానికి తృతీయ బహుమతి లభించింది. వీటితో పాటు పశు సంవర్ధక శాఖ, విద్యాశాఖ, మత్స్యశాఖ శకటాలు ఆకట్టుకున్నాయి.



ప్రథమ బహుమతి పొందిన మహిళా శిశు సంక్షేమ శాఖ శకటం



ద్వితీయ బహుమతి పొందిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ శకటం



తృతీయ బహుమతి పొందిన వ్యవసాయ శాఖ శకటం

అబ్బుర పరిచిన స్టాల్స్:
పోలీసు పరేడ్ గ్రౌండ్ ఆవరణలో ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి మేరుగు నాగార్జున, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికా గర్గ్ సందర్శించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో దేశం కోసం ప్రాణాలను కోల్పోయి అమరులైన సైనికుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. గ్రామీణ నీటి వనరుల శాఖ, జగనన్న స్వచ్ఛ సంకల్పం, పాఠశాల విద్యాశాఖ, పరిశ్రమల శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో అధికారులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అటవీ శాఖ స్టాల్‌లో పాముల ప్రదర్శనను తిలకించారు. శాస్త్రీయ సాంకేతిక రంగం స్టాల్ వద్ద విద్యార్థులు తయారు చేసిన రోబోట్‌ను పరిశీలించారు. కూలింగ్ గొడుగు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఇళ్లపట్టాలపై బురదజల్లొద్దు

- పేదలు క్షమించరు
- నాడు కోర్టుల్లో కేసులేయించి అడ్డుకున్నారు
- నిస్వార్థంగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం
- అక్రమాలు జరిగాయని నిరూపిస్తే రాజీనామా చేస్తా
- అర్ధరాత్రి నీళ్లిచ్చే విధానానికి చెక్
- రూ.339 కోట్లతో మంచినీటి పథకం పనులు త్వరలో ప్రారంభం
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ మాగుంట, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: మంచి మనస్సుతో, నిస్వార్థంగా ఒంగోలు నగరంలోని పేదలకు ఇళ్లపట్టాలు ఇస్తున్నామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. అయితే పేదల ఇళ్ల పట్టాలపై కూడా ప్రతిపక్ష టీడీపీ నాయకులు బురదజల్లే కార్యక్రమానికి తెరలేపుతున్నారని ఆరోపించారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంటే ఆ కార్యక్రమంపై కూడా బురదజల్లే ప్రయత్నాలను మాత్రం ప్రజలు క్షమించరని అన్నారు. ఇళ్ల పట్టాలు విషయంలో అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని బాలినేని సవాల్ విసిరారు. మంగళవారం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అర్ధరాత్రి నీళ్లిచ్చే విధానానికి త్వరలో చెక్ పెడుతున్నామన్నారు.నగర వాసుల తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు రూ.399 కోట్లతో మంచి నీటి పథకాన్ని చేపట్టనున్నామని, ఇందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం టెండర్ దశ పూర్తయిందని, త్వరలో పనులు కూడా కాంట్రాక్టర్ ప్రారంభిస్తారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒంగోలు నగరంలో అమృత్ మంచినీటి పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.123 కోట్లు కేటాయిస్తే ఆ పనులు పూర్తి చేయలేని అసమర్థుడు టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల అని ధ్వజమెత్తారు. మధ్యలో ఒదిలేస్తే రూ.70 కోట్లు ఒంగోలు నగర పాలక సంస్థకు భారంగా మారిందని గుర్తు చేశారు. ఆ భారం పూడ్చాలంటే ప్రజల మీద పన్నులు వేయాల్సి ఉంది. ప్రజలపై భారం మంచి పద్ధతికాదని సీఎం వైఎస్ జగన్ దృష్టికి సమస్యను తీసుకెళితే రూ.70 కోట్లు విడుదల చేశారన్నారు. అదే ప్రస్తుతం కొత్తగా మంజూరైన పథకంలో ఒంగోలు నగర పాలక సంస్థ వాటా కేవలం రూ.7 కోట్లు మాత్రమేనని చెప్పారు. అదికూడా స్కీం నిర్వహణ కోసమన్నారు. ప్రభుత్వం వచ్చిన కొత్తల్లో ఒంగోలులో నిరుపేదలు 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇద్దామని యరజర్ల వద్ద భూములు సిద్ధం చేస్తే టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన అనుచరుల చేత కోర్టులో కేసులు వేసి అడ్డుపడ్డాడని మండి పడ్డారు. కేసు వేయించలేదని చెప్పే దమ్ము దామచర్లకు ఉందా అని సవాలు విసిరారు. ప్రస్తుతం కొత్తగా ఇళ్ల పట్టాలు ఇద్దామని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళితే ప్రైవేటు భూములు అయినా కొనిద్దామని చెప్పి రూ.200 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. మొత్తం 508 ఎకరాలు కొనుగోలు చేయించామన్నారు. దానిపై కూడా బురద జల్లే కార్యక్రమాన్ని చేస్తున్నారని విమర్శించారు. అందులో నేను సంపాదించుకునే పనైతే రూ.50 కోట్లు సంపాయించుకునేవాడినని కుండబద్దలు కొట్టారు. అందులో అవినీతి జరిగిందని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు 14400 మంది వద్ద డబ్బులు కట్టించుకున్నారని, కానీ 4 వేల ఇళ్లు కట్టించారని విమర్శించారు. మిగతా వాళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వాళ్ల డబ్బులను అప్పటి ఎన్నికల్లో పసుపు-కుంకుమకు ఇచ్చి టిడ్కో లబ్ధిదారుల నోట్లో మట్టికొట్టారు. వాళ్లకు తమ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చి, గృహాన్ని నిర్మించే కార్యక్రమాన్ని చేపడతామని వారికి భరోసా ఇచ్చారు. దామచర్ల జనార్దన్ రూ.2 వేల కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేశానని పచ్చి అబద్ధాలు చెబుతున్నాడని ధ్వజమెత్తారు. గోడలకు రంగులు వేయటం, రోడ్డుమీద రోడ్డు వేయటం మినహా శివారు ప్రాంతాలను పట్టించుకున్నాడా అని నిలదీశాడు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఆలస్యమవుతుందని ముఖ్యమంత్రి అడిగారన్నారు. ఇంటింటి వద్ద ఎక్కువ సేపు గడపటం, వారి సమస్యలను తెలుసుకోవటంతో కొంత ఆలస్యం అవుతుందని, కానీ నియోజకవర్గం మొత్తం కచ్చితంగా పూర్తి చేస్తానని మాటిచ్చానన్నారు. ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తామని, అపోహలను ఎవరూ నమ్మవద్దన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన కార్పొరేషన్ సిబ్బందికి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధికి బాలినేని ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒడా చైర్ పర్సన్ సింగరాజు మీనా కుమారి వెంకట్రావు, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవ రావు, ఎంతు కే.మాల్యాద్రి, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డేటా ప్రాసెసింగ్ సెక్రటరీకి రాష్ట్రస్థాయి అవార్డు



దర్శి: దర్శి సచివాలయం–1లో డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ రాయపూడి ఏడుకొండలును రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం వరించింది. విజయవాడలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో సచివాలయాల శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ డాక్టర్ లక్ష్మీశా, అడిషనల్ కమిషనర్ డాక్టర్ భావన, డాక్టర్ ధ్యాన్‌చంద్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు.

'టంగుటూరి' వారసులకు సన్మానం



ఒంగోలు టౌన్: స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో స్వాతంత్ర్య పోరాట యోధుల వారసులను సత్కరించారు. టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమలు హనుమంతరావు, సంతోష కుమారిని మంత్రి మేరుగు నాగార్జున, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్ సన్మానించారు. అలాగే, కరవది వెంకటేశ్వరరావు కూతురు కె.సుబ్బలక్ష్మి, శేషగిరిరావు, గంగవరపు వందనం కుమారుడు భాస్కరరావును కూడా సన్మానించారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, మేయర్ గంగాడ సుజాత చేతులమీదుగా ప్రశంస పత్రాలు అందుకుంటున్న సేథుమాధవన్(మార్కాపురం సబ్‌కలెక్టర్), వి.విశ్వేశ్వరరావు(ఆర్డీఓ), కె.అన్నపూర్ణ(ఆత్మ పీడీ), పి.రాజశేఖర్(డీసీఓ), ఎ.చంద్రశేఖర్‌రెడ్డి(మత్స్యశాఖ జేడీ), జీవీ నారాయణరెడ్డి(డీపీఓ), పి.భాస్కర్‌బాబు(ఈఈ, ఎస్‌డబ్ల్యూ), ఎస్.రాజ్యలక్ష్మి(డీఎంహెచ్‌ఓ), వి.శ్రవణ్‌కుమార్(ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్), దుద్దు జయ(ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్), ఎస్‌కే మర్దన్‌ఆలీ (ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ), కె.కొండయ్య(పంచాయితీరాజ్ ఎస్‌ఈ), గోపిచంద్(డీహెచ్‌ఓ), ఎంవీఎస్ లోకేశ్వరరావు(ఎఫ్‌ఎస్‌ఓ)



సైమన్‌విక్టర్(ఆర్‌ఐఓ), ఆర్.లోకనాథం(ఏపీఎస్‌డీసీ, మేనేజర్), బి.జయరామిరెడ్డి(ట్రిపుల్ ఐటీ డైరెక్టర్), ఎస్‌కె.ఫజులుల్లా(చీమకుర్తి కమిషనర్), సాయికుమార్(డీఎల్‌డీఓ, మార్కాపురం) , ఎస్.సుబ్బారావు(జెడ్పీ పీఈఓ), కె.రవీంద్రరెడ్డి(తహసీల్దార్), వి.కిరణ్(తహసీల్దార్), పి.మురళి(తహసీల్దార్), కె.వెంకటేశ్వరరావు(తహసీల్దార్), డీసీహెచ్ కొండయ్య(సీఎంఎం, మెప్మా), కె.మారుతీకృష్ణ(వీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కోఆర్డినేటర్), ఎ.పవన్‌కుమార్(హౌసింగ్ డీఈఈ), టి.వనజ(సింగరాయకొండ సర్పంచ్), ఎం.రమణమ్మ(బచ్చలకూరపాడు సర్పంచ్), ఎం.వసంత(అర్ధవీడు సర్పంచ్), పాపారావు(సీఐ), డి.మల్లికార్జునరావు(సీఐ), బి.సుదర్శన్(ఎస్‌ఐ)



మంత్రి, కలెక్టర్, ఎస్పీ నుంచి ఉత్తమ సేవా పతకాలు అందుకుంటున్న (కుడి నుండి ఎడమకు) బి.ప్రేమ్‌కుమార్(ఎస్సై), యు.శ్రీనివాసులు (సీఐ), సీహెచ్ రంగస్వామి(ఎస్సై), పి.రమేష్‌బాబు(ఏఎస్సై), ఎస్.ప్రవీణ్‌కుమార్(హెచ్‌సీ), ఎస్‌కె.షకీర్‌బాషా(హెచ్‌సీ), టి.వెంకట్రావు(హెచ్‌సీ), వి.శ్రీను(పీసీ), వి.సుబ్బారావు(పీసీ), ఎస్‌కే జిలానీ(పీసీ), యు.జనార్దనరావు(పీసీ), సీహెచ్ బ్రహ్మయ్య(పీసీ), ఎం.భీమానాయక్(సీఐ), ఎస్.వెంకటేశ్వరరావు(ఏఆర్ ఎస్సై), పి.లక్ష్మణరావు(ఏఎస్సై), ఎన్.సుబ్బారావు(ఏఎస్సై), జి.శ్రీనివాసరావు(ఏఎస్సై), కె.లక్ష్మినారాయణ(ఏఎస్సై), ఎ.వెంకటేశ్వరరావు(ఏఆర్ హెచ్‌సీ), కె.శేఖర్‌బాబు(ఏఆర్ హెచ్‌సీ), కేవీ రాఘవేంద్ర(సీఐ), ఎస్‌కే నాగూర్‌మీరావలి(హెచ్‌సీ)



ఎ.వెంకటేశ్వర్లు(సీఐ), ఎన్‌వీ సుబ్బారావు(డిప్యూటీ ఏసీ, కమర్షియల్ ట్యాక్స్), బి.రవికుమార్(జీఎస్‌టీఓ), సీహెచ్.మాధవీలత(ఏపీఓ, సమగ్రశిక్ష), అంకిత సురానా(ట్రైనీ ఎస్పీ), బి.సుందరరామయ్య(ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్), ఎ.పద్మజ(ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్), ఎ.మాధవరావు(ఎంవీఐ), కిరణ్‌ప్రభాకర్(ఎంవీఐ)

ఉత్తమ సేవకు సత్కారం

విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలందించిన వివిధ శాఖల అధికారులను అవార్డులు వరించాయి. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా నిర్వహించిన వేడుకల్లో మంత్రి మేరుగు నాగార్జున, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతులమీదుగా అవార్డులు అందజేశారు

టంగుటూరు ఎస్సైకి కేంద్ర హోంశాఖ మెడల్



మంత్రి చేతులమీదుగా మెడల్ అందుకుంటున్న ఎస్సై ఖాదర్‌బాషా

ఒంగోలు టౌన్: టంగుటూరు ఎస్సై షేక్ ఖాదర్ బాషాకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రశంసా పత్రం, మెడల్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 77వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఎస్సై ఖాదర్‌బాషా మెడల్ అందుకున్నారు. చెన్నైలోని మైలాపూర్‌కు చెందిన వృద్ధ దంపతులు శ్రీకాంత్, అనూరాధను వారి గృహంలోనే హత్య చేసిన దొంగలు.. ఆ మృత దేహాలను మహబలిపురంలోని ఒక ఫాంహౌస్‌లో పాతిపెట్టారు. ఇంట్లో ఉన్న బంగారం, వెండితో పాటు నగదు అపహరించి పారిపోయారు. అయితే దొంగలు ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చినట్లు సమాచారం అందుకున్న ఎస్పీ మలికా గర్గ్ వెంటనే పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో పరారావుతున్న దొంగలను పట్టుకోవడంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై షేక్ ఖాదర్‌బాషాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అవార్డు వరించింది.

కనిగిరిలో 18 వేల డబుల్ ఓట్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

- పరిశీలించి తొలగించాలన్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్
- స్థానికులకు కచ్చితంగా ఓటు హక్కు ఉండాలని, బీఎల్వోలు నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచన

కనిగిరి రూరల్: 'నియోజకవర్గంలో సుమారు 18 వేల డబుల్, దొంగ ఓట్లున్నాయి. నా దగ్గర ఆ వివరాలున్నాయి. వాటిని మీకందిస్తా. నిశితంగా పరిశీలించి తొలగించండి' అని కనిగిరి ఎమ్మెల్యే, ఎన్జీరంగా వర్సిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీఎల్వోల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండి అక్కడే స్థిరపడి కనిగిరిలో, అక్కడ రెండు చోట్ల ఓట్లున్న వారిని, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని పార్టీలకతీతంగా గుర్తించి తొలగించాలన్నారు. ఈ 18 వేల ఓట్లలో దాదాపు 10 వేల ఓట్లు నియోజకవర్గం పరిధిలోని రెండుమూడు మండలాల్లో ఉన్నాయన్నారు. సుమారు 8 వేల ఓట్లు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు తన దగ్గర నివేదికలున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఆ వివరాలను త్వరలో అధికారులకు అందజేస్తానన్నారు. వాటిని పరిగణలోకి తీసుకుని ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయాలన్నారు. బీఎల్వోలు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకావద్దన్నారు. ఓటర్ల జాబితా పరిశీలన, తయారీలో బీఎల్ఏల సహకారం తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా ఒత్తిడి తెస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఓటర్ల జాబితా పరిశీలనలో బీఎల్వోలు ప్రలోభాలకు గురై తప్పు చేస్తే వారిపై కచ్చితంగా వేటు వేస్తామని, అవసరమైతే ఉద్యోగం నుంచి రిమూవ్ చేసేందుకు సిఫార్సు చేస్తామని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఆర్డీఓ టీ అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఓటర్ల జాబితా తయారీలో ఎటువంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలన్నారు.

స్థానికేతరులు, డబుల్ ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఏకగ్రీవ ఆమోదం...

తొలుత కనిగిరి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ ప్రతిపాదనకు అఖిలపక్ష సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. నియోజకవర్గంలో 18 వేల డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని నిశితంగా గుర్తించి పార్టీలకతీతంగా తొలగించాలన్న ఎమ్మెల్యే ప్రతిపాదనకు మిగతా పక్షాల సభ్యులు ఆమోదం తెలిపారు. తల్లిదండ్రులు కనిగిరి నియోజకవర్గంలోనే ఉండి వారి పిల్లలు బతుకుదెరువుకు బయట రాష్ట్రాలకు వెళ్తే అటువంటి వారిని కూడా గుర్తించి వారు ఇక్కడే ఓటు వేసేందుకు ఇష్టపడితే తగిన ఆధారాలు తీసుకుని ఏపీలోనే కనిగిరిలోనే ఓటు హక్కు కల్పించాలన్నారు. సుమారు 20 ఏళ్ల నుంచి అసలు రాష్ట్రంలో, కనిగిరి నియోజకవర్గంలోనే లేకుండా బయట జీవిస్తూ ఎన్నికల్లో ఇక్కడా, అక్కడా రెండు చోట్ల ఓటు హక్కు వినియోగించుకోవాలనుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అజయ్‌కుమార్, తహసీల్దార్ పుల్లారావు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలానీ, జేసీఎస్ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళి, టీడీపీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుడు నరాల శ్రీనివాసులరెడ్డి, సీపీఐ, సీపీఎం నాయకులు జీపీ రామారావు, పీసీ కేశవరావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ నాలుగో సెమిస్టర్ మూల్యాంకనం

ఒంగోలు: ఏఎన్‌యూ డిగ్రీ నాలుగో సెమిస్టర్ మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభమవుతుందని స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి పేర్కొన్నారు. అధ్యాపకులు మధ్యాహ్నం ఒంటిగంటకల్లా రిపోర్టు చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బీఏ ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, బీకాం కామర్స్, బీఎస్సీ అన్ని సబ్జెక్టుల పేపర్లు వచ్చాయని వివరించారు. చీరాల, మార్కాపురం, ఒంగోలు పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కాలేజీల అధ్యాపకులు అందరూ యూనివర్సిటీ అపాయింట్ చేసిన నూతన ఐడీ కార్డు(ప్రస్తుతం ఒంగోలు డీఎస్ ప్రభుత్వ మహిళా కాలేజీలో ఉన్నాయి) తీసుకుని హాజరు కావాలని సూచించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి



త్రిపురాంతకం: విద్యుత్ షాక్‌కు గురై ఓ ప్రైవేటు విద్యుత్ కార్మికుడు మృతిచెందిన ఘటన త్రిపురాంతకం మండలంలోని దివేపల్లిలో జరిగింది. గ్రామంలో నిర్మాణంలో ఉన్న కొత్త ఇంటికి విద్యుత్ పైప్‌లైన్ పనులు చేస్తున్న త్రిపురాంతకం మండలం గొల్లపల్లికి చెందిన పుచ్చకాయల రవీంద్ర (19) కటింగ్ మిషన్‌కు ఎర్త్ వచ్చి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వైద్యం నిమిత్తం త్రిపురాంతకం వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుర్మరణం



నివాసాల్లోకి దూసుకెళ్లి ఆగిన మినీ ట్రక్కు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో



మృతిచెందిన ఆటోడ్రైవర్ శ్రీనివాసులు

బేస్తవారిపేట: ఆటోను అశోక్ లేల్యాండ్ ట్రక్కు ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన బేస్తవారిపేట సమీపంలోని పాతసినిమాహాలు సెంటర్ వద్ద కడప–తోకపల్లె హైవేపై మంగళవారం తెల్లవారుజామున జరిగింది. బేస్తవారిపేటలోని అంకాలమ్మవీధికి చెందిన శెట్టిబత్తిన శ్రీనివాసులు ప్రతిరోజూ బేస్తవారిపేట జంక్షన్ నుంచి పాలు, పెరుగు ప్యాకెట్లను ఆటోలో తీసుకుని జంగంగుంట్ల, రాచర్ల, దిగువమెట్ట ప్రాంతాల్లోని షాపులకు సరఫరా చేస్తుంటాడు. మంగళవారం తెల్లవారుజామున జంక్షన్‌లో పాలప్యాకెట్లను ఆటోలో పెట్టుకుని బయలుదేరే సమయంలో పిల్లి ఎదురు రావడంతో ఆటో ఆపి టీ తాగి కొద్దిసేపటి తర్వాత బయలుదేరాడు. బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే పాత సినిమాహాలు సెంటర్ వద్ద మూలమలుపులో గుంటూరు నుంచి నంద్యాల వెళ్లే మినీ ట్రక్కు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జయింది. డ్రైవర్ శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. మినీ ట్రక్కు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న నివాస గృహాల్లోకి దూసుకెళ్లింది. రఫీ అనే వ్యక్తి ఇంటి ముందున్న పెద్ద ప్లాస్టిక్ వాటర్‌ట్యాంకు, ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం ముక్కలైంది. ఓ ఇంటి ముందున్న చెట్టును ఢీకొని గృహంలోకి దూసుకెళ్లకుండా నిలిచిపోయింది. మృతుడు శ్రీనివాసులుకు భార్య రంగలక్ష్మమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. ఎస్సై మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- కారు వెనుక భాగంపై పడిన గ్రానైట్ రాయి
- కారులో ఉన్న నలుగురు సురక్షితం



లారీ నుంచి పడిన భారీ గ్రానైట్ రాయి, పక్కనే దెబ్బతిన్న కారు

చీమకుర్తి: ట్రాలీ లారీ నుంచి భారీ పరిమాణంలో ఉన్న గ్రానైట్ రాయి జారి కారు వెనుక భాగంపై పడటంతో కారులో ఉన్న నలుగురు వ్యక్తులకు ఊపిరి ఆగినంతపనైంది. ఈ సంఘటన చీమకుర్తి ఎస్‌ఎస్సీ కాలనీ శివారులో పారడైజ్ హోటల్ ఎదుట కర్నూలు రోడ్డుపై మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రామతీర్థం క్వారీల నుంచి ఓ లారీ గ్రానైట్ బ్లాకులతో ఒంగోలు వైపు బయలుదేరింది. అదే సమయంలో చీమకుర్తి నుంచి రామతీర్థం వైపు కారు వెళ్తోంది. ఎస్‌ఎస్సీ కాలనీ శివారు వద్ద లారీ నుంచి భారీ గ్రానైట్ బ్లాక్ జారి కారు వెనుక భాగాన్ని రాసుకుంటూ కిందపడింది. అదే రాయి కారుపై పడి ఉంటే పరిస్థితి ఏమిటో ఊహించుకుంటేనే గుండె ఝల్లుమందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, కారు వెనుక భాగం స్వల్పంగా దెబ్బతింది. కారు యజమాని కావటి నాగకిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌రెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వరగాని రంజిత్‌కుమార్ కనిపించడం లేదని తండ్రి దానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు తెలిపారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ నిత్యం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండటంతో ఈ నెల 13వ తేదీన తండ్రి మందలించారు. సెల్‌ఫోన్‌లో సిమ్ తొలగించడంతో మనస్తాపం చెందిన రంజిత్‌కుమార్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మూడు రోజులుగా వెతికినా ఎక్కడా జాడ లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అర్ధవీడులో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

అర్ధవీడు (కంభం): మండల కేంద్రమైన అర్ధవీడులోని ఓ గృహంలో దొంగలు పడి నగదు, బంగారు, వెండి నగలు అపహరించుకెళ్లిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానిక సాయి ఫంక్షన్ హాల్ ఎదురువీధిలో నివాసం ఉంటున్న అక్రమ్ నంద్యాల జిల్లా డోన్‌లోని బంధువుల ఇంటికి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. మంగళవారం సాయంత్రం ఇంటికి తిరిగొచ్చి చూడగా, తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.80 వేల నగదు, 800 గ్రాముల వెండి నగలు, సుమారు మూడు తులాల బంగారు నగలు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూజ్‌టీమ్ వేలిముద్రలు సేకరించింది.

కులాంతర వివాహం చేసుకున్నాడని దాడి



బాధితులను పరామర్శిస్తున్న ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

దర్శి: తన కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్న యువకుడి తల్లి, అక్కపై యువతి తల్లిదండ్రులు దాడిచేసి గాయపరిచిన సంఘటన దర్శి మండలం బొట్లపాలెం ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. డీఎస్పీ అశోక్‌వర్ధన్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, పుల్లమ్మ దంపతుల కుమార్తె భార్గవి ఎస్సీ కులానికి చెందిన అనూరాధ కుమారుడు సాయిరాం మార్చి 2వ తేదీన వివాహం చేసుకున్నారు. వారి వినతి మేరకు రక్షణ కల్పించాలని ఎస్పీ మలికాగర్గ్ దర్శి పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేసి ఎలాంటి గొడవలు పడవద్దని చెప్పి పంపారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని బ్రహ్మారెడ్డి, ఆయన భార్య పుల్లమ్మ కలిసి అర్ధరాత్రి ఎస్సీ కాలనీకి వెళ్లి యువకుడి తల్లి అనూరాధ, ఆమె కుమార్తె మౌనిక కళ్లలో కారం కొట్టి దాడి చేశారు. మౌనికను కత్తితో పొడవబోగా చేయి అడ్డు పెట్టడంతో ఆమె చేతికి గాయమైంది. ఇనుపరాడ్డుతో తలపై కొట్టి గతంలో ఉన్న కేసులు వెనక్కి తీసుకోవాలని, లేదంటే చంపేస్తామని భయభ్రాంతులకు గురిచేశారు. వారిద్దరినీ కొట్టుకుంటూ బ్రహ్మారెడ్డి ఇంటికి తీసుకువెళ్లి కట్టేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్రహ్మారెడ్డి ఇంట్లో తాళ్లతో కట్టేసి ఉన్న అనూరాధ, అపస్మారక స్థితిలో ఉన్న మౌనికను గుర్తించారు. వారిని పోలీసు వాహనంలో తీసుకెళ్లి దర్శి సీహెచ్‌సీలో వైద్యం అందించారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ అశోక్‌వర్ధన్ తెలిపారు. బాధితులను ట్రైనీ ఎస్పీ అంకితా సురానా పరామర్శించారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.